హైస్కూల్ చదువుకు అగచాట్లు

- పోలవరం యూపీ స్కూలుకు వందేళ్ల చరిత్ర
- ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచాలని డిమాండ్
- హైస్కూల్ విద్య కోసం పొరుగూరు వెళ్లాల్సిన దుస్థితి
- అగచాట్లుపడుతున్న నాలుగు గ్రామాల విద్యార్థులు



పోలవరం ప్రాథమికోన్నత పాఠశాల

గూడూరు: హైస్కూలు చదువు అందుబాటులో లేక నాలుగు గ్రామాల విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. పోలవరంలోని ప్రాథమిక పాఠశాలకు వందేళ్ల చరిత్ర ఉంది. 1922లో తోట వెంకట సుబ్బయ్య పాఠశాలను ప్రారంభించినట్లు గ్రామస్తులు చెబుతారు. ప్రాథమిక పాఠశాలగా మొదలైన బడి ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగుతోంది. ఇక్కడ పాలవరం, ఐదుగుళ్లపల్లి, రాచర్లపాలెం, రామన్నపేట విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. హైస్కూలు చదువుకు అగచాట్లు పడి పొరుగూరు వెళుతున్నారు.

160 మంది విద్యార్థులు..

చేనేత కార్మికులు అధికంగా ఉండే గ్రామం పోలవరం. గ్రామంలో బలహీన వర్గాల వారే ఎక్కువ. విద్యకు ఉన్న ప్రాధాన్యత గుర్తించిన తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడికి పంపిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు చదువుల పట్ల ఆసక్తి చూపిస్తున్న నేటి కాలంలో కూడా పోలవరం ప్రాథమికోన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇక్కడ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుండటంతో పాఠశాలకు ఆదరణ ఏ మాత్రం తగ్గలేదు. బడికి కావాల్సిన సదుపాయాల విషయంలో గ్రామస్తులు సొంత నిధులు సమకూర్చుతూ ఉంటారు.

నాడు- నేడుతో మహర్దశ

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా పాఠశాలకు మహర్దశ పట్టిందనే చెప్పాలి. మన బడి నాడు - నేడు ఫేజ్-1లో ఎంపికైన పాఠశాలలో రూ.15 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. దీనికి దాతల సహకారం కూడా తోడవ్వడంతో పాఠశాల స్వరూపమే మారిపోయింది. విద్యార్థులకు భోజనశాల, మరుగుదొడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్ వంటి వసతులు సమకూరాయి.

హైస్కూల్ చదువు పొరుగూరులోనే..

హైస్కూల్ చదువుల కోసం కిలో మీటర్ల మేర పొరుగు ఊళ్లకు వెళ్లక తప్పని పరిస్థితి. 8వ తరగతి వరకు పాఠశాలలోనే చదువుకున్న విద్యార్థులు 9, 10 తరగతుల కోసం మల్లవోలు హైస్కూలుకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో విద్యార్థులు అనేక వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. హైస్కూల్ ఏర్పాటు కోరుతూ ఇటీవల మాజీ సర్పంచి కారుపర్తి శ్రీనివాస్ పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. నేటికీ ఎలాంటి స్పందన లేదు.


హైస్కూలుగా స్థాయి పెంచాలని ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న శ్రీనివాస్ (ఫైల్)

విద్యార్థులకు మేలు..



8వ తరగతి వరకు ఇక్కడ చదువుకున్న విద్యార్థులు 9, 10 తరగతులకు మల్లవోలు వెళ్లాల్సి వస్తోంది. పోలవరంలో ఉన్నత పాఠశాల ఏర్పాటైతే పోలవరంతో పాటుగా ఐదుగుళ్లపల్లి, రాచర్లపాలెం, రామన్నపేట ప్రాంతాల్లోని విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. హైస్కూలుగా అప్‌గ్రేడ్ అయితే ఉపాధ్యాయులు కూడా పెరుగుతారు. అదనపు తరగతి గదులు కూడా నిర్మించాల్సి ఉంటుంది.

– బి.విజయలక్ష్మి, హెచ్ఎం, యూపీ స్కూల్, పోలవరం

అన్ని అర్హతలు ఉన్నాయి..



పోలవరం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ సమంజసమే. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా దీనికోసం ప్రయత్నం చేశాం. 73 మంది విద్యార్థులు ఉన్న ముక్కొల్లులో హైస్కూలు నడుస్తోంది. 160 మంది విద్యార్థులు ఉన్న రాయవరం, 168 మంది విద్యార్థులు ఉన్న కంకటావలో ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలగానే 160 మంది విద్యార్థులు ఉన్న పోలవరం పాఠశాలను ఉన్నత పాఠశాలగా చేయాలి.

– పిచ్చుక గంగాధరరావు, వైస్ ఎంపీపీ, గూడూరు మండలం

క్లుప్తంగా

వెండి తమలపాకుల మాల వితరణ




పెడన: పట్టణంలోని బస్టాండ్ సెంటర్లోని గణపతి సాయి శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయస్వామికి 108 వెండి తమలపాకుల మాలను భక్తులు శనివారం బహూకరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ చిమట హరిదాసు పెద్ద కుమార్తె మాధురి, మనవరాలు శ్లోఘన వీటిని అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శివకోటి కామేశ్వరశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి రజిత తమలపాకుల మాలను అలంకరించారు. ఈ పూజా కార్యక్రమంలో గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు పడమట బలరాం, సభ్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెడన ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకటేష్

పెడన: స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవోగా సీహెచ్. వెంకటేష్ నియమితులయ్యారు. మచిలీపట్నం ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకటేష్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కృష్ణా జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఎం.జయరాం జనవరి 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఫిబ్రవరి ఒకటి నుంచి ఖాళీ అయింది. దీంతో వెంకటేష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

నేడు మందిర నిర్మాణానికి శంకుస్థాపన



టి.కొత్తపాలెం (నాగాయలంక): గ్రామంలో గ్రామ దేవత గంగానమ్మ మందిర నిర్మాణ పనులకు ఆదివారం టి.కొత్తపాలెం గ్రామ భక్త బృందం ఆధ్వర్యంలో ఉదయం గం.9.18లకు శంకుస్థాపన జరుగుతుందని శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త బండ్రెడ్డి నాగిరెడ్డి శనివారం తెలిపారు. మందిరం నిర్మాణం కంటే ముందుగానే చాలా కాలం క్రితం గంగానమ్మ విగ్రహం సమకూర్చినప్పటికీ మందిర నిర్మాణం కోసం గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు మందిరం నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని భక్తబృందం పెద్దలు చెప్పారు.

భవిత కేంద్రానికి టేబుల్ అందజేత

పెడన: పట్టణంలోని బంగ్లాస్కూలులో నడుస్తున్న ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థుల భవిత కేంద్రానికి యూ ఆకారంలో టేబుల్‌ను జిల్లా విద్యాశాఖ విశ్రాంత అధికారి మట్టా రాధాకృష్ణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 వై హరనాథ్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు యూ టేబుల్ అవసరాన్ని గుర్తించి రాధాకృష్ణమూర్తి అందజేయడం అభినందనీయమంటూ కొనియాడారు. రూ.12 వేల విలువైన టేబుల్‌ను విద్యార్థుల అవసరాన్ని గుర్తించి ఇచ్చినట్టు రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగ్లా స్కూలు హెచ్ఎం భాగ్యలక్ష్మి, పేరెంట్ కమిటీ చైర్మన్ సుధారాణి, వైస్ చైర్మన్ బాబు, సహిత విద్య రిసోర్స్ పర్సన్‌లు రమ్య, అబ్దుల్ హమీద్, సీఆర్పీలు హమీదుల్లా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, భవిత కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటు

బంటుమిల్లి: మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి మేనేజరు పెద్దిరాజులు పర్యవేక్షణలో ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు బంటుమిల్లి ఆర్టీసీ బంకు, బస్టాండు పర్యవేక్షకుడు ప్రసాద్ తెలిపారు. ఏడు రోజుల ప్రయాణ సమయంగా భోజనం, టిఫిన్, బస సౌకర్యాలతో ఒక్కొక్కరికి సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.12,500, స్లీపరు స్టార్‌లైనర్ బస్సుకు రూ.15,500 నిర్ణయించినట్లు ప్రసాద్ చెప్పారు. ఈ నెల 4, 15 తేదీల్లో బస్సులు ఏర్పాటు చేశామన్నారు. వారం రోజుల ప్రయాణంలో భాగంగా పూరీ, కోణార్క్, ప్రయాగ్‌రాజ్ కుంభమేళా, వారణాసీ, గయ, అయోధ్య పుణ్యక్షేత్రాలను సందర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు అసిస్టెంటు మేనేజరు సెల్ 96184 80995 నంబరులో, బంటుమిల్లి బంకు వద్ద తనను సంప్రదించాలని ఆయన కోరారు.

ఏరు దాటాక బోడి మల్లన్నలా కూటమి తీరు

కొడాలి(ఘంటసాల): కూటమి ప్రభుత్వ వాగ్దానాలు నమ్మి ప్రజలు తీవ్రంగా మోసపోయారని బీఎస్పీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని కొడాలిలో శనివారం నిర్వహించిన బీఎస్పీ నేతల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్టులో ఏపీకి మొక్కుబడి నిధులు విడుదల చేశారే కాని, నిత్యావసర ధరలపై స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఈ రాజకీయ పార్టీలకు బహుజనుల సాధక బాధలు తెలియవని, వాగ్దానాలన్నీ ఏరు దాటాక బోడిమల్లన్న అన్న చందాన ఉంటాయని ఎద్దేవా చేశారు.

సిబ్బంది సేవలు అభినందనీయం

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు


ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించిన జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

కోనేరుసెంటర్: ప్రజల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణరకు పాటుపడిన సిబ్బంది సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు పేర్కొన్నారు. జిల్లాలోని ఉయ్యూరు, పెనమలూరు పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుళ్లు బి.మొహమ్మద్‌సర్దార్, బి.ఏడుకొండలును ఎస్పీ తన కార్యాలయంలో కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అత్యున్నత సేవలను అందించినవారికి పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పోలీసు ఉద్యోగం పొందిన నాటి నుంచి కుటుంబం కంటే పోలీసుశాఖకే అధిక ప్రాధాన్యతను ఇచ్చి అహర్నిశలు శ్రమించినవారి సేవలను పోలీసుశాఖ మరచిపోదన్నారు. ఉద్యోగ విరమణ కాలానికి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటం అదృష్టంగా భావించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ సిబ్బందికి పోలీసుశాఖ తరపున ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా నిస్సంకోశంగా అధికారులను కలవ వచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కుటుంబ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

92.3 శాతం పింఛన్ల పంపిణీ

మోపిదేవి: మండలంలో శనివారం 92.3 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జె.స్వర్ణభారతి తెలిపారు. తొలుత తెల్లవారు జామున సర్వర్ పని చేయక పోవడంతో పింఛన్లు అందుకునే అవ్వాతాతలు గ్రామ సచివాలయాల వద్దకు చేరుకున్నారు. 9 గంటల తరువాత సర్వర్ పని చేస్తుండటంతో సిబ్బంది ఇంటింటా తిరిగి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 6,119 పింఛన్లకు గాను 5,648 పింఛన్లు సాయంత్రం 5 గంటల వరకు 92.3 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వివరించారు.

కౌలురైతుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం

కంకిపాడు: కౌలురైతుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కౌలురైతులకు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. వ్యవసాయంలో కీలకంగా ఉన్న కౌలురైతులను విస్మరించడం సరికాదన్నారు. కౌలు రైతాంగానికి ప్రయోజనాలను కల్పించడం, సాగులో చేయూత అందించడంలో తొలి నుంచి కేంద్రం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి కేవలం రూ. 86 వేలు కోట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. గ్రామీణాభివృద్ధిపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్ర వైఖరిని నిరసిస్తూ ఈనెల 5వ తేదీన అన్ని గ్రామాల్లో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ ట్రాన్స్‌మిషన్ మరమ్మతులు

నున్న(విజయవాడరూరల్): ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ నున్న-గుడివాడ ట్రాన్స్‌మిషన్ విద్యుత్ లైన్ల మరమ్మతులు శనివారం (ఫిబ్రవరి 1) నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు జరుగుతాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.కోటేశ్వరరావు, ఓఅండ్ఎం నున్న ఒక ప్రకటనలో తెలిపారు. 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం గుడివాడలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాని తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుంది. కానీ దీని వల్ల సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అయితే అత్యవసర పరిస్థితి ఉత్పన్నం అయితే 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, కేవీ చిగురుకోటల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం

కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి


కేవీకేలో అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డాక్టర్ గోపాలస్వామి, సుధారాణి

ఘంటసాల: తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో పెరటి కోళ్ల పెంపకం చేపట్టడం వలన అధిక ఆదాయం వస్తుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో పెరటి కోళ్ల పెంపకంపై ఆరు రోజుల నైపుణ్యత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ భారత దేశంలో నేటికి 65 శాతానికిపైగా జనాభా వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అనుబంధ రంగాలలో తక్కువ శ్రమ, పెట్టుబడితో పోషకాహారాన్ని, ఆదాయాన్ని అందించే రంగం పెరటికోళ్ల పెంపకం అన్నారు. డాక్టర్ ఎస్‌వీఎస్ గోపాలస్వామి పెరటి కోళ్ల పెంపకం వలన లాభాలను వివరించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ పిన్నమనేని మనోజ్ కుమార్ మాట్లాడుతూ నాటు కోడిగుడ్లలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, ప్రతి కుటుంబం పెరటి కోళ్ల పెంపకం చేపట్టాలని కోరారు. కేవీకే మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ అధిక ఉత్పాదకత శక్తిగల కోళ్ల రకాలను వివిధ పథకాల ద్వారా గ్రామీణ ప్రజలకు చేరువ చేసేందుకు కేవీకే కృషి చేస్తోందన్నారు. అనంతరం శిక్షణ పొందిన అభ్యర్థులకు శాస్త్రవేత్తలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నవీన్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సబ్‌జోన్ ఆటల పోటీల్లో విద్యార్థుల సత్తా


సబ్‌జోన్ పోటీలలో పతకాలు సాధించిన రాయవరం బాలికలు


సాధించిన పతకాలతో రాళ్లరేవు విద్యార్థులు

గూడూరు: నియోజకవర్గ స్థాయి సబ్‌జోన్ పోటీల్లో బాలికలు సత్తాచాటారు. శుక్రవారం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలలో బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ విభాగాలలో రాయవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జూనియర్, సీనియర్ విభాగాలలో ప్రథమ స్థానం సాధించారు. ఏకంగా మూడు విభాగాలలో ప్రథమ స్థానం సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి నందం మల్లీశ్వరి, ప్రధానోపాధ్యాయిని ఎం.ఎం.సౌజన్య కుమారి, ఎస్ఎంసీ చైర్మన్ లీలాకరుణలు పతకాలు సాధించిన బాలికలను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ పి.గోవింద రాజులును అభినందనించారు.

కృత్తివెన్ను: మండల పరిధిలోని రాళ్లరేవు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గూడూరులో జరిగిన సబ్‌జోన్ బాలికల ఆటల పోటీల్లో ప్రతిభ కనపరిచి సత్తా చాటారు. సీనియర్స్ విభాగం టెన్నీకాయిట్, సాఫ్ట్‌బాల్‌లో ప్రథమ స్థానం, త్రోబాల్‌లో ద్వితీయ స్థానం, జూనియర్స్ విభాగం టెన్నీకాయిట్, సాఫ్ట్‌బాల్‌లో ప్రథమస్థానం, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖోలో ద్వితీయస్థానాలు సాధించినట్లు హెచ్ఎం చంద్రమోహన్ తెలిపారు. విద్యార్థులతో పాటు, వారి ప్రతిభకు కారణమైన వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజును స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

పట్టుదలతో చదివితే విజయం సులభం

డీఎస్పీ విద్యశ్రీ


డీఎస్పీని సత్కరిస్తున్న కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు

అవనిగడ్డ: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే విజయం సాధించడం సులభమేనని డీఎస్పీ విద్యశ్రీ అన్నారు. స్థానిక ఎస్వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో శనివారం సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధిస్తే ఢిల్లీ యూనివర్సిటీతో పాటు పేరొందిన యూనివర్సిటీల్లో సీటు సాధించడం ఈజీ అన్నారు. విద్య ద్వారానే పేదరికాన్ని జయించవచ్చని, చదువు ద్వారా ఏదైనా సాధించగలమని డీఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు డీఎస్పీని ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి దీపిక

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, రెండవ అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దీపిక అన్నారు. స్థానిక నోబుల్ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ బాలబాలికలు, యువకులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో చట్టం వివరాలను వారికి వివరించారు. ఈ చట్టం పరిధిలో ఎవరైనా నేరం చేస్తే ఏ విధంగా శిక్షించబడతారో వివరించారు. బాలికలు స్నేహం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. స్నేహం చేసేటప్పుడు అవతలి వ్యక్తి గుణగణాలను తెలుసుకోవాలన్నారు. ఈ సదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, మచిలీపట్నం ఏఎస్ఐ ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు సీహెచ్ షాలిని, పాల్ సుధాకర్, కోటేశ్వరరావు, చిత్తరంజన్‌దాస్ పాల్గొన్నారు.

రేపు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ

- 107 ఏళ్ల చారిత్రక ఆలయానికి నూతన శోభ
- రూ.2.5 కోట్లతో పునర్నిర్మాణం


ఆలయ, విగ్రహ పునఃప్రతిష్ఠ పూజల్లో పురోహితులు


విద్యుద్దీప కాంతుల్లో నూతన ఆలయ గోపురం

మచిలీపట్నంటౌన్: స్థానిక నిజాంపేటలోని కల్యాణ సుందరేశ్వర సమేత శ్రీ విజయ వనమలమ్మ ఆలయానికి మహర్దశ వచ్చింది. 107 సంవత్సరాల చరిత్ర కలిగిన శిథిల ఆలయం స్థానంలో భక్తులు సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో కొండరాయితో నూతన ఆలయాన్ని నిర్మించారు. మార్టూరు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన రాతితో ఆలయం, అమ్మవారి విగ్రహం, పలు దేవతామూర్తుల విగ్రహాలను రూపొందించారు. ఈ నెల 3వ తేదీన ఉదయం 11.45 గంటలకు పునఃప్రతిష్ఠించేందుకు ఆలయ భక్త బృదం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రతిష్ఠా మహోత్సవానికి సంబంధించి గత జనవరి 31న ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల వద్ద పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి నిర్వహించనున్నారు. సోమవారం ఆలయ, విగ్రహాల పునః ప్రతిష్ఠతో పాటు ప్రాణప్రతిష్ఠ, కలాన్యాసాదికములు, నేత్రోన్మీలనము వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రికి అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహిస్తారు.

ఉద్యోగ విరమణ సత్కారం


రాంబాబును అభినందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ

కోనేరుసెంటర్: విద్యారంగంలో విశిష్ట సేవలను అందించిన కందిమళ్ల రాంబాబు ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నట్లు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. మచిలీపట్నం మండలంలోని కానూరు మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన రాంబాబు అభినందన సభ శనివారం పాఠశాలలో జరిగింది. రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డీఆర్డీఓ ఆవరణ నుంచి ఆవులను తరలించాలి

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన శనివారం జరిగింది. వివిధ శాఖల అధికారులతో తొలుత సమీక్ష జరిపారు. ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ మాట్లాడుతూ గుల్లలమోద వద్ద డీఆర్డీఓ ప్రాజెక్ట్ ఆవరణలోనికి అడవుల్లో తిరిగే గోవులమంద నుంచి సుమారు 30 ఆవులు ఏడాది క్రితం వెళ్లి బయటకు పోవడం లేదని, తోలే ప్రయత్నం చేస్తే పొడుస్తున్నాయని సంస్థ సిబ్బంది ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ సమస్యను సంస్థ వర్గాలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన కారణంగా తక్షణం ప్రాజెక్ట్ స్థలం నుంచి వాటిని బయటకు పంపాలని అటవీశాఖపై జరిగిన సమీక్షలో అధికారుల దృష్టికి తెచ్చారు. భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్ మాట్లాడుతూ వక్కపట్లవారిపాలెం- భావదేవరపల్లి ప్రధాన మార్గంలో ఓఎన్జీసీ చమురు అన్వేషణ సంస్థ కోసం వచ్చే భారీ వాహనాల కారణంగా ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైందని, సంస్థ కార్యకలాపాల కారణంగా పరిసర గ్రామాల్లో వాయు కాలుష్యం అధికమైందని, రిగ్గింగ్ పరిసరాలలో పంట పొలాలకు తీవ్ర నష్టం ఏర్పడి రైతులు ఆందోళన చెందుతున్న దృష్ట్యా సంస్థ అధికారులను పిలిపించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఉదయభాస్కర్ సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ రాఘవరాణి మాట్లాడుతూ సభ్యుల సూచనలను పరిగణలోకి తీసుకుని అవసరమైన చర్యలకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్, ఎంఈఓ- 2 ఏ.రామారావు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాల్లో 480 మంది రైతులకు లబ్ధి

బంటుమిల్లి: మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల్లో గత నెలలో 11 రోజులపాటు పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో 480 మంది రైతులకు చెందిన 7,357 జంతువులకు సేవలందించామని పెదతుమ్మిడి వైద్యాధికారి స్ఫూర్తి తెలిపారు. జనవరి 20 నుంచి 31వ తేదీ వరకు పంచాయతీల్లో బంటుమిల్లి, అర్తమూరు, పెదతుమ్మిడి పశువైద్యశాలల ఆధ్వర్యంలో వైద్యులు స్ఫూర్తి, రాజీవ్‌నాయక్‌ల పర్యవేక్షణలో శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ శిబిరాల్లో 277 పశువులకు చూడు, గర్భధారణ, 532 పశువులు, దూడలకు నట్టల నివారణ మందులు, 6,548 జీవాలు, కోళ్లు పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకున్న రైతులకు, సేవలందించిన సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సామర్థ్యాల మేరకు ఉపాధి కల్పనపై సమీక్ష

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), దీనదయాళ్ జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ మార్గదర్శకాల ప్రకారం సిటీ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్ (సీ- ఎల్‌ఏపీ) రూపొందించేందుకు అధికారుల బృందం శనివారం సమావేశమైంది. నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశమైన అధికారులు నగరంలోని పేద ప్రజలందరికీ వారి సామర్థ్యం, నైపుణ్యం ఆధారంగా జీవనోపాధిని కల్పించటం ద్వారా వారి కుటుంబాల తలసరి ఆదాయం పెంచుటకు ప్రణాళిక రూపకల్పనపై చర్చించారు. నగర కమిషనర్ బాపిరాజు అధ్యక్షతన సిటీ లైవ్‌లీహుడ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో రాబోయే ఐదు సంవత్సరాలకు సిటీ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్‌పై (సీఎల్ఏపీ) చర్చించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రోత్సాహం అందించడమే కాకుండా వారి సామర్థ్యాలను పెంచి స్వయం ఉపాధికి వీలుకల్పించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామని కమిషనర్ తెలిపారు. ఎన్ఐఎంఎస్ఎంఈ భాగస్వామ్యంతో లైన్ డిపార్టుమెంటు సిబ్బందికి, సీఎల్‌టీఎఫ్ కమిటీ సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీని ద్వారా ఉద్యోగ అవకాశాల విస్తరణ, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు అందరూ సహకరించాలని ఆయన కోరారు. మెప్మా సీఎంఎం ఆనంద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.